

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి రజిని

## నేర ప్రవృత్తి నివారణకు ప్రతిఒక్కరూ శ్రీకారం చుట్టాలి

వనపర్తి టౌన్, డిసెంబర్ 1 : సమాజంలో నానాటికీ పెరుగుతున్న నేర ప్రవృత్తిని నివారించేందుకు ప్రతిఒక్కరూ శ్రీకారం చుట్టాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి రజిని అన్నారు. జిల్లాకేంద్రంలోని చిట్యాల గ్రామ శివారులోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అసోసియేషన్ సభ్యులతో న్యాయ సేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో చాపకింద నీరులా హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రబలుతుందని, దానిని కూకటివేళ్లతో పెకిలించివేయాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాధ్యతగల దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ లాంటి రోగాలపై అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వాటిని శాశ్వతంగా నిర్మూలించవచ్చన్నారు. మహిళలు, బాలికలపై పెరిగిపోతున్న లైంగికదాడులు మానవ సమాజాన్ని కుంగదీస్తున్నాయన్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలను హింస ప్రవృత్తి విధానాలు రూపుమాపేందుకు ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, పాలకులు, అధికారులు సమైక్య కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కోర్టుల ద్వారా న్యాయం పొం దడం ఆలస్యం కావచ్చు గానీ బాధితులకు తప్పకుండా న్యాయం జరుగు తుందన్నారు. ప్రజల మార్పుతోనే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటు ందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ దవాఖాన ఎయిడ్స్ విభాగం అధికా రి బండారి శ్రీనివాసులు, న్యాయవాదులు ఉత్తరయ్య, సఖి కౌన్సిల్ డేగల కృష్ణయ్య, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు భీమయ్య, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన


మదనాపురం గురుకుల పాఠశాలలో
విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మదనాపురం, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై మదనాపురం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌వో జయచందర్ మోహన్, అదనపు డీఎంహెచ్‌వో శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి భవాని, ఆరోగ్య సూపర్‌వైజర్ ప్రమీల, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, ఆరోగ్య సిబ్బంది భారతమ్మ, హాజి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం



మహిళకు కేసీఆర్ కిట్‌ను
అందజేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్, డిసెంబర్ 1 : ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం అందుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి అన్నారు. మండలంలోని కదిరేపాడు గ్రామానికి చెందిన గర్భిణికి శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పు చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం కేసీఆర్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో సాధారణ కాన్పులు జరుగుతున్నాయని, ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

# టెన్షన్..టెన్షన్



- ఇష్టదైవాలపై భారం వేసిన అభ్యర్థులు
- గెలుపునందించాలని ప్రత్యేక పూజలు
- ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల్లో మొదలైన గుబులు

వనపర్తి రూరల్, డిసెంబర్ 1 : ఎన్నికల ప్రచారంలో ప్రజలు విస్మరించినా ప్రచారం బాగా చేశాం.. కాలికి చక్రాలు కట్టుకున్నట్లుగా ఇంటింటికీ తిరిగినం, డబ్బులు కూడా గట్టిగానే పచ్చినం.. నమ్మిన ప్రజలు గెలిపిస్తారో లేక ఇష్టదైవాలు అండగా నిలుస్తారో డిసెంబర్ 3 వరకు వేచి చూడాలి.. అని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. ఇంక కౌంటింగ్‌కు మరికొన్ని గంటలు మాత్రమే మిలిగిన ఉన్న తరుణంలో ఆదివారం వెలువడే ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అని అనుచరులతో కొంతమంది తీవ్ర ఒత్తిడికి గురికావడం ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా నెలరోజుల కిందటి వరకు గెలుపును పక్కన పెట్టి మెజారిటీ లెక్కలు వేస్తూ ఊహాలోకంలో విహరిస్తున్న నేతలు హడలిపోతున్నారు. ప్రత్యర్థుల నుం చి గట్టి పోటీ ఎదురవుతుండడంతో అసలు గెలుస్తామో..లేదో అన్న ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో డిసెంబర్ 3న వెలువడే ఫలితాల వరకు టెన్షన్ తప్పదంటూ అభ్యర్థులు వాపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో తమకు ప్రజల నుంచి అంతగా అపూర్వ స్పందన రాకపోవడంతో ప్రతిపక్షనాయకులకు అంతుచిక్కడంలేదు. ఫలితాలు అనుకూలంగా ఉంటాయని ఓ వైపు పైకి చెబుతున్నప్పటికీ లోలోపల తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ మినహాయిస్తే అన్నీ పార్టీల నాయకులకు చెమటలు పడుతున్నాయి. అలాగే ఓటర్లుపై నమ్మకం పెట్టుకున్న అభ్యర్థులు ఇష్టదైవాలను గట్టిగా మొక్కుతున్నారు. తమను గెలిపించాలని కొందరు ముడుపులు సైతం కట్టినట్లు సమాచారం. అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు కూడా పూజల్లో నిమగ్నమవుతున్నట్లు తెలుస్తోంది.

# రెండో ర్యాండమైజేషన్ విజయవంతం

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, డిసెంబర్ 1 : నియోజకవర్గంలో కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ విజయవంతం అయినట్లు కలెక్టర్ తేజస్‌నందలాల్ తెలిపారు. శుక్రవారం చిట్యాల ఏఎంసీ గోదాంలో ఆన్‌లైన్ వెబ్ ద్వారా రెండో ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్ మిశ్రాతో కలిసి కలెక్టర్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన సూ పర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్‌లతో రెండో ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందికి 14టేబుల్స్ కోసం సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. అలాగే 20శాతం అదనపు సిబ్బందితో కలుపుకొని 22కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 25 కౌంటింగ్ అసిస్టెంట్లు, 23 మంది మైక్రో అబ్జర్వర్లతో కౌంటింగ్ ఉం టుందని తెలిపారు.


ఏఎంసీ గోదాంలో రెండో ర్యాండమైజేషన్‌ను
ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేస్తున్న ఎన్నికల అధికారి, సాధారణ పరిశీలకులు


ఈవీఎంల స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న కలెక్టర్, సంబంధిత అధికారులు

కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఈడీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంలు

ఈవీఎంలను చిట్యాల మార్కెట్ యార్డు గోదాంలోని స్ట్రాంగ్ రూంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ భద్రపర్చినట్లు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. నియోజకవర్గంలోని 296పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్ర పర్చామన్నారు. వీటిని భద్రతా దళాల నిఘాలో భద్రపర్చడమే కాక, స్ట్రాంగ్ రూం ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పుటేజ్ అక్కడే పక్కన ఉన్న భవనంలో పెట్టినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈవీఎం పుటేజ్ ఉన్న భవనంలోనే బస ఏర్పాటు చేయడంతో వారు నిరంతరం పర్యవేక్షణ చేసుకొనే విధంగా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు సోమేశ్ మిశ్రా, రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

పాన్‌గల్, డిసెంబర్ 1 : మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన సంగనమోని శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేతేపల్లి ఉన్నత పాఠశాల 1993-94బ్యాచ్ పదో తరగతి స్నేహితులందరూ కలిసి రూ.37,900 పోగు చేశారు. ఈ మొత్తాన్ని వారు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అందజేశారు. కార్యక్రమంలో బాబర్, బాలస్వామి, డబ్బా వెంకటయ్య, విష్ణు, నర్సింహారెడ్డి, రాము, ఆంజనేయులు, మైబూస్ పాల్గొన్నారు.


కేతేపల్లిలో శ్రీనివాసులు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు


దత్త కోటిలింగేశ్వర ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న భక్తులు

## వైభవంగా రుద్రహోమాలు

కొత్తకోట, డిసెంబర్ 1 : మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ఉన్న దత్త కోటి లింగేశ్వర ఆలయంలో శుక్రవారం 20 శివకోటి యంత్రాలకు రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాస మహాశివరాత్రి వరకు 15రోజులపాటు ఈ హోమాలను నిర్వహిస్తున్నారు. శివకోటి యంత్రాలను భక్తులు తమ సహస్త్రాలతో ప్రతిష్ఠ చేయనున్నారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, మహేశ్వర్, అర్చకులు జగదీశ్, అనిల్ తదితరులు ఉన్నారు.